సాక్షి
సూర్యాపేట

బుధవారం : 12 : జూన్ : 2024



పార్టీ గౌరవాన్ని కాపాడుతారని..
డీసీసీబీలో తనతో పాటు మరో 9మంది డైరెక్టర్లు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు.
- 10లో



యాదాద్రిలో వేలు ఆనందచారి
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఆలయ స్తపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనంద చారి మంగళవారం దర్శించుకున్నారు.
- 12లో

గరిష్టం / కనిష్టం
34^0 / 25^0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంకు విద్యార్థుల ఎంపిక

భానుపురి (సూర్యాపేట) : 2024–25 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద సూర్యాపేట పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లక్కీడ్రా విధానంలో విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.లత తెలిపారు. 1వ తరగతిలో 94 మంది, 5వ తరగతిలో 98 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. 1వ తరగతి విద్యార్థులకు ఈనెల 18న, 5వ తరగతి విద్యార్థులకు 19న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



కలెక్టర్‌కు డైరీ అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు

సూర్యాపేటటౌన్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటరావుకు వినతి పత్రం అందజేశారు. తాము ఇచ్చిన వినతిపత్రానికి ప్రభుత్వానికి పంపాలని వారు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ 2024 డైరీని కలెక్టర్ వెంకటరావు, డీఈఓ అశోక్‌తో పాటు పలువురు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నేతికండ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటటౌన్ : చట్టాలపై ఇచ్చే శిక్షణను పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం, భారతీయ న్యాయ సంహిత నూతన చట్టాలు 2023పై మంగళవారం రెండవ రోజు పోలీసులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు చట్టాలపై పూర్తి అవగాహన, అందులో నైపుణ్యం ఉంటేనే వాటి అమలు సాధ్యమన్నారు. కోర్టుల్లో కూడా కేసులను సులువుగా గెలవవచ్చని, నేరస్తులకు శిక్షలు అమలు చేయడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సీనియర్ అడ్వకేట్, డిటెక్టివ్ ట్రైనింగ్ సెంటర్ అధ్యాపకుడు డాక్టర్ సాంబమూర్తి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నేడు బహుమతి అందజేత

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీ డ్రాలో గెలిచిన వారికి బుధవారం నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో నగదు బహుమతిని అందజేయనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా లక్కీ డ్రాలో గెలుపొందిన 12 మంది ప్రయాణికులకు ఈ నగదు బహుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

మదర్ డెయిరీ కార్మికుల పర్మినెంట్

రాజాపేట: నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల పరిధిలోని అర్హత కలిగిన 238 కార్మికులను పర్మినెంట్ చేస్తూ నార్మూల్ మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఉత్తర్వు కాపీలు అందజేశారు. ఇందులో ప్రమోషన్ పొందిన కార్మికులు 181 మంది ఉన్నారు. ఈమేరకు కార్మికులు చైర్మన్‌కు, పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు చింతలపురి వెంకట్‌రాంరెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి, కస్తూరి పాండు, కొట్ల జెలంధర్‌రెడ్డి, చల్లా సురేందర్‌రెడ్డి, గూడూరు శ్రీధర్‌రెడ్డి, పిరంగి వెంకట్‌రాంరెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, కందాల అలివేలు రంగారెడ్డి, కర్నాటి జయశ్రీ ఉప్పల్‌రెడ్డి, డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే జీవితం

బడి ఏదైనా.. చదువుకోవాలనే తపన ఉండాలి ● నా పాఠశాల విద్య సర్కారు బడిలోనే

- గౌరవం, పేరు ప్రతిష్టలు అన్నింటికీ చదువే మూలం
- గ్రామీణ విద్యార్థుల్లో అపార ప్రతిభా పాటవాలు
- విద్యార్థి ఎదుగుదలలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం
- మా ట్యూషన్ సర్ నాకు స్ఫూర్తి

'సాక్షి'తో తన బాల్యం అనుభవాలు పంచుకున్న యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్



ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

'నేటి విద్యార్థులకు చదువే జీవితం కావాలి. గౌరవం, పేరు ప్రఖ్యాతులు చదువుతోనే సాధ్యం అవుతాయి. ప్రభుత్వ బడి అయినా, ప్రైవేటు స్కూల్ అయినా బాగా చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరూ జీవితంలో తప్పకుండా ఎదుగుతారు. ఏదో ఒక రూపంలో అవకాశాలు కలిసి వస్తాయి..' అని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్ పేర్కొన్నారు.

'ప్రైవేటు స్కూల్‌లోనే చదువుకుంటే ఎదుగుతారన్న భావన తప్పు. పిల్లల్లో చదువుకోవాలనే తపన ఉండాలి.. తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలకు ఉపాధ్యాయులు సానబెట్టి సరైన మార్గంలో నడిపిస్తే మార్గదర్శకులుగా నిలుస్తారు' అని వివరించారు. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్ తన పాఠశాల విద్యా విశేషాలను, అప్పటి పరిస్థితులను, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వ్యవహరించాల్సిన తీరును 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన వివరించిన తన చిన్ననాటి సంగతులు ఆయన మాటల్లోనే..

మాది నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామం. నాన్న రంగారావు టీచర్. మామిడాల చుట్టు పక్కల గ్రామాల్లో టీచర్‌గా పనిచేశారు. అమ్మ పెద్దగా చదువుకోలేదు. అప్పట్లో నాన్న జీతం తక్కువే. డబ్బులకు చాలా కష్టంగా ఉండేది. నేను జీవితంలో పైకి రావడానికి ఎందరో సహాయం చేశారు. వారికి నేను ఎప్పుడూ కృతజ్ఞుడిని. ఆరో తరగతి వరకు మామిడాలలోనే చదువుకున్నా. నాతోపాటు ఇద్దరు చెల్లెళ్లను చదివించటానికి అమ్మానాన్న చాలా కష్టపడ్డారు. అందుకే ఏడో తరగతి నుంచి ఇంటర్మీయెట్ వరకు నన్ను మా చిన్నాయిన మిర్యాలగూడలో తన ఇంట్లో ఉంచుకొని చదివించారు. తరువాత హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశా. అప్పుడు హైదరాబాద్‌లో పెద్దమ్మ వాళ్ల ఇంట్లోనే ఉండి చదువుకున్నా. ఆ తరువాత మద్రాస్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్, పీహెచ్‌డీ చేశా.

అప్పుడు టీచర్లంటే భయం

అప్పట్లో స్కూల్‌లో టీచర్లు అంటే చాలా భయంగా ఉండేది. మా టీచర్ ఒకాయన బడిలో చాలా కోపం చేసే వారు. కానీ ఆయన మంచి వారు, మేము బాగా చదువుకొని, గొప్పగా ఎదగాలనే అలా వ్యవహరించే వారని అమ్మా, నాన్న చెప్పేవారు. అదే నిజం. నాకు జీవితంలో ఎప్పుడూ మంచి టీచర్లే ఎదురయ్యారు. మంచి చెడు అనేది మన దృష్టి కోణాన్ని బట్టి కూడా ఉంటుంది. విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పడుతూ మార్గదర్శకంగా నిలిచే టీచర్లు జీవితాంతం గుర్తుండిపోతారు. మిర్యాలగూడలో చదువుకునేటప్పుడు రామయ్య సర్ దగ్గరికి గణితం ట్యూషన్‌కు వెళ్లేవాడిని. నేను ట్యూషన్ డబ్బులు ఇవ్వలేకపోయినా ఆయన నన్ను ట్యూషన్ క్లాస్‌లో కూర్చోనిచ్చేవారు. బాగా చదువుకొమ్మని ప్రోత్సహించే వారు. అలాంటి గొప్ప టీచర్ల వల్ల విద్యార్థుల జీవితాలు మలుపుతిరుగుతాయి. అందుకే నాకు ఉపాధ్యాయులంటే చాలా గౌరవం.

గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు అపార ప్రతిభాపాటవాలు ఉంటాయి. వాటికి సానబెడితే మెరికల్లా తయావుతారు. అందుకే బడి ఏదైనా.. చదువుకోవాలనే తపన కలిగి, కష్టాలు ఎదురైనా చదువుకునే విద్యార్థులకు ఏదో ఒక రకంగా అవకాశాలు కలిసివస్తాయి. జీవితంలో ఎదుగుతారు. పేరు ప్రఖ్యాతులు గడిస్తారు. పట్టుదలతో చదువుకునే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్.

అమ్మ ఇచ్చిన ధైర్యంతోనే..

చిన్నప్పుడు పాఠశాలు పునఃప్రారంభమైన సమయంలో నాకు బడికి వెళ్లాలంటే కొంత ఉత్సాహంగా ఉండేది. బడికి వెళ్లి స్నేహితులతో ఆడుకోవచ్చని అనుకునే వాడిని. అలాగే కొంచెం విచారంగా కూడా ఉండేది. అమ్మను వదిలేసి బడికి వెళ్లాలంటే బాధగా అనిపించేది. అమ్మే నాకు గురువు. మానసికంగా ఎంతో ధైర్యాన్ని ఇచ్చేది. నేను ఏది సాధించినా దానికి చిన్నప్పుడు అమ్మ ఇచ్చిన ధైర్యమే కారణం. సెలవుల తరువాత బడికి వెళ్లాలంటే కొంచెం ఇష్టం లేకపోయినా, చదువుకోవడం ముఖ్యం కాబట్టి మొదటి రోజు ఇష్టం చేసుకొని వెళ్లే వాడిని. ఆ తరువాత అలవాటు అయ్యేది.

సాయంత్రం నడిచి వచ్చేవాడిని

నాన్న ఉదయం సైకిల్‌పై కూర్చోబెట్టుకొని తీసుకెళ్లి స్కూల్ దగ్గర దింపితే, సాయంత్రం నడిచి ఇంటికి వచ్చే వాడిని. నా పాఠశాల విద్య అంతా ప్రభుత్వ పాఠశాల్లోనే పూర్తయింది. అదీ తెలుగు మీడియంలోనే. మా బడి ఇంటికి ఒక కిలోమీటర్ దూరంలోనే ఉండేది. కొన్ని గ్రామాల్లో మాత్రం బడి చాలా దూరంగా ఉండేది. ఇప్పుడు నల్లగొండ లాంటి టౌన్లలో ఇంటికి బడి దూరంగా ఉంటున్నా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు స్కూటర్‌పై లేదంటే ఆటోలో దింపడం అనివార్యం అవుతోంది.

బడికి అలా వెళ్లాం..
- వివరాలు 10లో

బడికి వేళాయే!



చివ్వెంల: జగనాతండా ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కోసం నిర్మిస్తున్న నల్లాలు



సూర్యాపేటలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- వేసవి సెలవుల తర్వాత బడిబాట పట్టనున్న విద్యార్థులు
- మొదటి రోజే పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ
- 265 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పూర్తి కాని పనులు

సూర్యాపేటటౌన్ : వేసవి సెలవులు పూర్తయ్యాయి. మళ్లీ బడికి వేళయింది. నెలన్నర రోజులపాటు ఆటపాటలతో గడిపిన పిల్లలు పాఠశాల బాట పట్టనున్నారు. విద్యార్థుల ఉరుకులు, పరుగులు, కేరింతలతో స్కూళ్లు సందడిగా మారనున్నాయి. 2024–25 నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 536 అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేయగా 271 బడుల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి.

విద్యార్థులను ఆకర్షించేలా..

జిల్లాలో 950 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 70వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో మహిళా సంఘాల సభ్యులతో యూనిఫామ్ కుట్టించారు. మొదటి విడతగా ప్రతి విద్యార్థికి ఒక్కో జత చొప్పున యూనిఫామ్ అందజేయనున్నారు. అలాగే పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ కూడా మొదటి రోజు ఇవ్వనున్నారు. తొలి రోజు విద్యార్థులను ఆకర్షించేలా పాఠశాలలను అలంకరించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులను కూడా పిలిపించి పాఠశాలలో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశాల్లో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లను పిలిచి విద్యార్థులకు వారి చేతుల మీదుగా నోట్‌బుక్స్, పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేయనున్నారు.

పాఠశాల	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	690	33,200
ప్రాథమికోన్నత	78	13,012
ఉన్నత	182	24,330
మోడల్ స్కూల్స్	09	6,500
కేజీబీవీలు	19	3,706

మొదటి రోజు నుంచే యూనిఫామ్, పుస్తకాల పంపిణీ



విద్యార్థులను ఆకర్షించేలా ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వచ్చేలా ఉపాధ్యాయులు ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. పాఠ్యపుస్తకాల నుంచి మధ్యాహ్న భోజనం వరకు అన్నీ ఉచితంగా అందజేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. మొదటి రోజు నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్స్ అందజేయనున్నాం.

– అశోక్, డీఈఓ

ఇంకా పూర్తి కాని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు

జిల్లాలో 536 అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ స్కూళ్లలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, కలర్స్ వేయడం లాంటి పనులు చేస్తున్నారు. మంచినీరు, విద్యుత్, ఇతర వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 271 పాఠశాలల్లో పనులు పూర్తి స్థాయిలో జరిగినా ఇంకా కొన్నింటిలో కలర్స్ వేస్తున్నారు. 265 పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. బడుల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా సకాలంలో బిల్లులు రాకపోవడంతో కొన్నింటిలో పనులు నిదానంగా సాగుతున్నాయి.

పండుగ వాతావరణంలో ప్రారంభించాలి

- కలెక్టర్ వెంకటరావు



వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట): పండుగ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించాలని కలెక్టర్ ఎస్.వెంకటరావు తెలిపారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం స్వయం శక్తిసంఘాలతో దుస్తులు కుట్టించి పంపిణీ చేస్తుందని, ఈ సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టించే బాధ్యతను అప్పగించిందన్నారు. ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మండల స్పెషల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 13వ తేదీన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన పొందేలా చూడాలని, మహిళా సంఘాల ద్వారా ఆయిల్ బాల్స్ తయారు చేయించాలన్నారు. ఇందుకోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బడిబాట కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి విజయవంతం చేయాలన్నారు. కొందరు ఎంపీడీఓలు సరిగా స్పందించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, తహసీల్దారు, ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

ప్రత్యేక మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయాలి

సూర్యాపేటటౌన్ : 2023 సెప్టెంబర్ తర్వాత దీర్ఘకాలిక వ్యాధులకు గురైన ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేసి బదిలీల్లో వారిని ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద చేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్‌లు జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. మంగళవారం స్థానిక టీపీయూయస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2023 సెప్టెంబర్‌కు ముందు బదిలీకి సాధారణ కేటగిరి కింద దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో కొందరు ఇటీవల కాలంలో దురదృష్టవశాత్తు దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యారని, ప్రస్తుతం వీరు చికిత్సలో ఉన్నారని, జీఓ నంబర్ 5 ప్రకారం వీరికి బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉందని పేర్కొన్నారు. అందువల్ల డీఈఓ వారి కోసం ప్రత్యేక మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయించి సంబంధిత ధ్రువీకరణ జారీ చేయించాలని కోరారు. అదే విధంగా ఇటీవలి కాలంలో దురదృష్టవశాత్తు భర్తలను కోల్పోయిన మహిళా ఉపాధ్యాయులను వితంతు విభాగంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్‌లో సమస్యలు ఉత్పన్నం కాకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

మహిళా రైతులను ప్రోత్సహించాలి



రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు

పెన్‌పహాడ్: రైతునేస్తంలో కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొనేలా అధికారులు ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు దేశానికే ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రైతులందరూ కలిసి చర్చించుకొని పంట దిగుబడిని సాధించాలని ఆయన సూచించారు. విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించే గేయం రైతులకు వినిపించారు. అనంతరం అధిక సాంద్రత విధానంలో ప్రతి పంటపై దృశ్య శ్రవణ విభాగం వ్యవసాయ విశ్వవిద్యాలయం వారిచే వీడియో ప్రదర్శించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయంపై రైతుల అనుభవాలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వ్యవసాయ అధికారులు బాలదినకర్, ఆశాకుమారి, డి. దివ్య, ఎ. అరుణ, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా నిర్వహించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ వంటి పూజలు జరిపించారు.

కార్పొరేట్‌శక్తుల చేతిలో దేశం బందీ



హుజూర్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : కార్పొరేట్‌శక్తుల చేతిలో భారతదేశం బందీ అయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాసపురంలో హుజూర్‌నగర్ జోన్ పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. చాయ్‌వాలా అని ఓ పక్క చెబుతూనే మరో పక్క10 ఏళ్లుగా ప్రభుత్వ ఆస్తులను అమ్మి పేద మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం మోపాడని ధ్వజమెత్తారు. మిత్రపక్షాల సహాయంతో మోదీ మరోసారి అధికారంలోకి వచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. రాముడు, కశ్మీర్ పేరుతో దేశం అంతటా ఓట్లు దండుకున్నప్పటికీ అయోధ్య, కశ్మీర్‌లో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారని పేర్కొన్నారు. గతంలో కంటే మిత్రపక్షాల బలం పెరిగిందని బెంగాల్, కేరళ, త్రిపురలో బలపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నాయకురాలు తంగేళ్ల వెంకటచంద్రతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగారపు పాండు, యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, బ్రహ్మం, సైదులు, పాండునాయక్, హుస్సేన్, బాలునాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో కిసాన్ సమ్మాన్ నిధి

- రైతుల ఖాతాల్లో జమకానున్న డబ్బులు
- పెట్టుబడులకు ఆసరా కానున్న నిధులు
- జిల్లాలో 1.69 లక్షల మందికి ప్రయోజనం



భానుపురి (సూర్యాపేట) : జిల్లా రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్‌నిధి సొమ్ము జమ చేయనుంది. ఏటా మూడువిడతలుగా రూ.2వేల చొప్పున మొత్తం రూ.6వేలను కేంద్ర ప్రభుత్వం పంట పెట్టుబడి కింద అందిస్తోంది. ఇప్పటికే 16 విడతలుగా ఈ సొమ్మును అందించగా 17వ విడత నిధులను ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విడుదల చేస్తూ తన తొలిసంతకం చేశారు. ఈ నేపథ్యంలో ఒకటిరెండు రోజుల్లోనే రూ.2వేల చొప్పున 19వ విడత కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రైతుల అకౌంట్లలో జమ కానున్నాయి. దీంతో జిల్లాలో సుమారుగా 1.69 లక్షల మంది కర్షకులకు ప్రయోజనం కలనుంది.

అక్కెరకు రానున్న నిధులు..!

నైరుతి రుతుపవనాల రాకకు ముందే జిల్లావ్యాప్తంగా ఒకటిరెండు మోస్తరు వర్షాలు పడ్డాయి. దీనికి తోడుగా మృగశిర కార్తె ప్రారంభం కావడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 60 శాతానికి పైగా పత్తి విత్తనాలు విత్తుకునే పనులు పూర్తయ్యాయి. వానాకాలం వరి సాగు కోసం నారుమడులను దున్నేందుకు సంసిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగం విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, కూలీల ఖర్చులు.. ఇలా పెట్టుబడి కోసం డబ్బులు అవసరమై ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందిస్తున్న రైతుబంధుపై నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో రైతులు పెట్టుబడి డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో చిన్నసన్నకారు రైతులకు ఈ కిసాన్ సమ్మాన్‌నిధి సొమ్ము ఆసరాగా నిలువనుంది.

ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలి



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బుల కోసం రైతులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో చేసుకున్న వారు కాకుండా అర్హులై డబ్బులు జమ కాని రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకుంటేనే డబ్బులు జమ అవుతాయి. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో 1.69 లక్షల మందికి ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2019 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టింది. ఆ సమయంలో జిల్లాలో 2.60 లక్షల మందికి ఈ డబ్బులు జమ అయ్యాయి. అనంతరం పలు నిబంధనలు, ఈ కేవైసీ పూర్తి చేసుకోకపోవడం తదితర కారణాలతో భారీగా లబ్ధిదారులు తగ్గారు. 16వ విడతలో జిల్లాలో దాదాపు 1.69 లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి నిధులు నేరుగా అకౌంట్లలో జమ అయ్యాయి. ఈ లెక్కన 17వ విడతలోనూ ఈ కేవైసీ చేసుకున్న వారితో పాటు ఈ 1.69 లక్షల మంది రైతులకు డబ్బులు అందనున్నాయి.

క్లుప్తంగా

15న పీహెచ్‌డీ ఎంట్రెన్స్ పరీక్ష

నల్లగొండ రూరల్: మహాత్మగాంధీ యూనివర్సిటీలో ఈ నెల 15న పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్ డైరెక్టర్ ఆకుల రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

- చేనేత సంఘం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా



చేనేత సహకార సంఘం ఎదుట ధర్నా చేస్తున్న చేనేత సంఘం నాయకులు

చౌటుప్పల్: కార్మికులకు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ, కమిటీ సభ్యులు మాత్రం వారికి తెలిసిన వ్యక్తులకు మాత్రమే పని ఇస్తున్నారని చేనేత అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. ఈమేరకు మంగళవారం చేనేత సహకార సంఘం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం ఆస్తులను అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కమిటీ సభ్యుల అవినీతిపై అధికారులు విచారణ జరిపించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు నూతన ఆర్డర్ కాపీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోశిక స్వామి, గుర్రం నర్సింహ, గోశిక రవీందర్, భిక్షపతి, గోశిక పురుషోత్తం, వనం ధనుంజయ్య, సుంకి రవి, కర్నాటి జనార్దన్, గోశిక నర్సింహ, భాస్కర్, జెల్ల నారాయణ, లక్ష్మయ్య, బాల్యం చంద్రయ్య, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృతి

పెద్దవూర: పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృతిచెందాయి. వివరాలు.. పెద్దవూర మండల పరిధిలోని గేమ్యానాయక్ గ్రామ పంచాయితీ పరిధిలోని జగ్రాం తండాకు చెందిన నేనావత్ సామ్య తన రెండు ఆవులను రోజుమాదిరిగానే సోమవారం కూడా మేత కోసం పొలం వద్దకు తోలుకుని వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం రాగా.. పిడుగు పడి రెండు ఆవులు మృతిచెందాయి. మృతిచెందిన ఆవుల విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని, తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బడికి అలా వెళ్లాం..

వారంతా సర్కారు బడుల్లోనే చదువుకున్నారు. అమ్మా,నాన్న, అక్కా,అన్నయ్యలు తోడురాగా బడి బాట పట్టారు. ఆడుతూ పాడుతూ ఉపాధ్యాయుల బోధనలనే జీవిత పాఠాలుగా మలుచుకున్నారు. అరకొర సౌకర్యాల నడుమ కష్టపడి చదివి నేడు ఉన్నతస్థాయికి ఎదిగి పలువురికి ఆదర్శంగా నిలిచారు. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న సందర్భంగా వారు తమ చిన్ననాటిజ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

రెండేళ్ల పాటు మారాం చేశానంటా..

- ఎస్. వెంకటరావు,కలెక్టర్, సూర్యాపేట



భానుపురి (సూర్యాపేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా సాలూరులో 1970లో మొదటిసారి మా వీధిలో ఉన్న మున్సిపల్ స్కూల్‌కి నన్ను మా నాన్న తీసుకెళ్లడం ఇప్పటికీ గుర్తుంది. 2వ తరగతి వరకు స్కూల్‌కు వెళ్లేందుకు చాలా మారాం చేసేవాడినని మా అమ్మ చెబుతుండేది. ఊహ తెలిశాక మాత్రం ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లడం మానలేదు. చదువుతో పాటు ఆటల్లోనూ ఉత్సాహంగా పాల్గొనేవాడిని. సెలవులంటే చాలా ఇష్టం. అన్ని స్థాయిల్లోనూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాగా ప్రోత్సహించేవారు.

మా అక్క పాఠశాలకు తీసుకెళ్లేది

- మైల మధుసూదన్‌రెడ్డి, విజిలెన్స్ ఏఎస్పీ, హైదరాబాద్



నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం ముశంపల్లి పాఠశాలలో నేను చదువు ప్రారంభించాను. మొదటిరోజు పాఠశాలకు వెళ్లిన సమయంలో భయం వేసింది. అయితే మా అక్క నర్సమ్మ నన్ను రోజూ పాఠశాలకు తీసుకెళ్లేది. 1 నుంచి 5వ తరగతి వరకు ముశంపల్లి పాఠశాలలోనే చదివా. 6 నుంచి 10వ తరగతి వరకు చిన్నమాదారం నడుచుకుంటూ వెళ్లి చదువుకున్నాను. ఇంటర్మీడియట్ నల్లగొండ ప్రభుత్వ బాలుర కళాశాలలో, డిగ్రీ నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో, పీజీ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో చదివాను. 1989లో ఎస్సైగా ఉద్యోగంలో చేరి ఏఎస్పీ స్థాయికి ఎదిగాను. క్రమశిక్షణతో చదివితే విద్యార్థులు మంచి పౌరులుగా రాణిస్తారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి.

మొదటిరోజు నాన్నతో వెళ్లేవాడిని..

- కె.అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట



సూర్యాపేటటౌన్: నేను రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాను. ప్రతి సంవత్సరం పాఠశాల పునఃప్రారంభం రోజు కచ్చితంగా నాన్నను తీసుకెళ్లేవాడిని. పాఠశాల ప్రారంభం రోజు కచ్చితంగా హాజరయ్యేవాడిని. మా ఇంటి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో మా పాఠశాల ఉండడంతో నడుచుకుంటూ వెళ్లేవాడిని. పదో తరగతిలో సైకిల్‌పై వెళ్లా. స్కూల్‌లో టీచర్స్ ఇచ్చిన హోంవర్క్‌ను పూర్తిచేసి మరుసటి రోజు టీచర్లకు చూపించేవాళ్లం. హోంవర్క్ పూర్తి చేసిన వారిని ఉపాధ్యాయులు మెచ్చుకునేవాళ్లు. అప్పుడు ఇంకా బాగా చదవాలనిపించేది. పాఠశాల స్థాయిలోనే ఉపాధ్యాయులు మంచి విద్యనందించారు. వారి ప్రోత్సహంతోనే నేను ఈ స్థాయిలో ఉండగలిగాను.

విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే..

- శ్రీనివాసులు, ఆర్డీఓ, హుజూర్‌నగర్



హుజూర్‌నగర్: మా స్వస్థం మెదక్ జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామం. చంద్లాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో నా విద్యాభ్యాసం ప్రారంభించాను. మా తండ్రి వంగర కేశవులు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో చదువు ఎంత విలువైనదో తెలిసింది. 1వ తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాల, యూనివర్సిటీలోనే విద్యాభ్యాసం పూర్తిచేశాను. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడినయ్యా. ఇంటర్, డిగ్రీ సిద్దిపేటలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, బీఈడీ పూర్తిచేశాను. ఆ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం చేస్తూనే గ్రూప్ పరీక్షలు రాసి రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం ఆర్డీఓగా కొనసాగుతున్నా.

చిన్ననాటి ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువలేను

- పల్లె కాశిరెడ్డి, ఏసీపీ, వనస్థలిపురం



హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం మా సొంతూరు. మా తల్లిదండ్రులు పల్లె కోటమ్మ, కొండారెడ్డి వ్యవసాయం చేశారు. నిరక్షరాస్యులు కూడా. నన్ను విద్యావంతుడిగా తీర్చిదిద్దాలని నా చిన్నతనంలో మా అమ్మ నన్ను స్థానికంగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో చేర్పించింది. 7వ తరగతి వరకు అక్కడే చదువుకున్నాను. పదో తరగతి మేళ్లచెరువులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో, బీఏ నాగార్జునసాగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో చదివాను. ఓయూలో ఎంఏ, బీఈడీ పూర్తి చేశాను. మొదట నిజామాబాద్ జిల్లాలో ఆర్ఎస్ఐగా ఉద్యోగం సాధించాను. ఆ తర్వాత సివిల్ ఎస్ఐగా కన్వర్షన్ లభించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని వనస్థలిపురం ఏసీపీగా పనిచేస్తున్నాను. నాకు ప్రాథమిక పాఠశాలలో చిన్ని టీచర్ బోధించిన ఇంగ్లిష్ సబ్జెక్ట్ డిగ్రీ వరకు ఎంతో ఉపయోగపడింది. హైస్కూల్‌లో చిన్న వీరారెడ్డి సార్ చెప్పిన సాంఘిక శాస్త్రం ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివేందుకు ఉపకరించింది. ఆ టీచర్లను ఎప్పటికీ మరువలేను. ప్రభుత్వ పాఠశాలలో చదివిన చదువే నన్ను ఈస్థాయికి తీసుకొచ్చింది.

ఇసుకలో అఆలు దిద్దించారు

- నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో



నిడమనూరు : మాది నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామం. 1979లో మా నాన్న నూకల నర్సింహారెడ్డి మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నన్ను చేర్పించారు. అప్పట్లో మూడవ తరగతి వరకు మొత్తానికి ఒక్కటే గది, ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక్కరు వలంటీర్ ఉండేవారు. మా ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో చెట్ల కిందకు తీసుకెళ్లి అక్కడ ఉన్న ఇసుకలో అఆలు దిద్దించారు. అది ఇప్పటికీ గుర్తొస్తూనే ఉంటుంది. పాఠశాలలో తరగతులను అప్‌గ్రేడ్ చేసుకుంటూ పోవడం వల్ల పదో తరగతి వరకు ముకుందాపురం పాఠశాలోనే చదివాను. ఇంటర్ ప్రైవేట్ కాలేజీలో చేరతానంటే.. అక్కడ సరైన టీచర్లు ఉండరని.. ప్రభుత్వ కాలేజీలోనే చేర్పిచారు. తర్వాత డిగ్రీ, పీజీ కూడా ప్రభుత్వ కళాశాలల్లోనే చదివాను. ఐపీఎస్ కావాలనే లక్ష్యం ఉన్నా కాలేపోయాను. డిగ్రీ తర్వాత గ్రూప్–1 రాశాను. రెండు మార్కుల తేడాతో అర్హత సాధించలేదు. తర్వాత ఎస్ఐ ఉద్యోగం సాధించాను. ఇప్పుడు డీఎస్పీగా ప్రమోషన్ రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇప్పటికీ నేను చదువుకున్న ముకుందాపురం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తూనే ఉన్నా.

తొలిరోజు సంతోషంగా పాఠశాలకు వెళ్లాను

- ఎగ్గడి భాస్కర్, ఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో



అర్వపల్లి: నా చిన్నతనంలో నేను పాఠశాలకు తొలిరోజు కోమటిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు మా నాన్న గురువయ్యతో కలిసి ఎంతో సంతోషంగా వెళ్లాను. పాఠశాలను వెళ్లేటప్పుడు పలక, బలపం తీసుకెళ్లాను. అక్కడికి వెళ్లాక మాస్టారు నా పేరు, వివరాలు మా నాన్నను అడిగి రిజిస్టర్‌లో రాసుకున్నారు. తొలిరోజు పాఠశాలకు వెళ్లడం మరిచిపోలేని రోజు. కొద్దిసేపు తరగతిగదిలో కూర్చున్నాక తోటి పిల్లలతో వెళ్లి ఆడుకున్నాను. తొలిరోజు కాబట్టి అందరం పిల్లలం సంతోషంగా గడిపాం. పట్టుదలతో చదువుకొని ఐపీఎస్ సాధించాను.

కొత్త పుస్తకాల సువాసన ఎంతో మధురం

- కూతాటి గోపాల్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ, తమిళనాడు రాష్ట్రం



శాలిగౌరారం : మాది శాలిగౌరారం. నేను ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు శాలిగౌరారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. ఆ రోజుల్లో వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు వెళ్లేరోజు ఎంతో ఆనందంగా ఉండేది. బడికి పోయే మొదటిరోజు చేతిలో కొత్త పలక, కొత్త బలపం, కొత్త పెన్సిల్, కొత్త రబ్బరు, కొత్త పెన్ను, కొత్త పుస్తకాలు చేత బట్టుకుని పోయేవాళ్లం. పుస్తకాల సువాసన ఎంతో మధురంగా ఉండేది. ఆ అనుభూతిని మరిచిపోలేము. కొత్తగా పాఠశాలకు వెళ్లే సమయంలో ఉత్సాహం.. పట్టినా ఆగని వేగం.. బడికి వెళ్లాలని.. మిత్రులను కలుసుకోవాలని ఎంతో ఆశ ఉండేది. నేను అమ్మనాన్నలతో కలిసి మొదటిరోజు బడికి వెళ్లేవాడిని. ఎక్కువగా మా చిన్న అన్నయ్యతో కలిసి వెళ్లేవాడిని. వేసవి సెలవుల్లో నా సీనియర్ల వద్ద పుస్తకాలు తీసుకుని చదివేవాడిని. తొమ్మిదో తరగతిలోనే నేను హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి, ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. అప్పటి నుంచే డాక్టర్‌ను కావాలని కలలుకని పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ అయ్యాను. ఇంతకంటే ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలని తపనపడి సివిల్స్ రాసి ఐఏఎస్‌కు ఎంపికయ్యాను. తల్లిదండ్రులతో పాటూ అనేకమంది ఉపాధ్యాయులు, స్నేహితులు నాకు అన్ని విధాలుగా సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందించారు. చదువులో నాటి కష్టం ఫలితంగానే నేడు అత్యున్నత స్థాయిలో ఉన్నాను. ప్రతీ విద్యార్థి ప్రాథమిక స్థాయినుంచే విద్యలో పట్టుదల, ఏకాగ్రత, పోటీతత్వంతో ముందుకు సాగాలి. అప్పుడే భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలకు చేరుకోగలుగుతారు.

నాలుగు కిలోమీటర్లు నడిచేవాడిని..

- వస్కుల శ్రీనయ్య, ఖమ్మం జిల్లా జడ్జి



కొండమల్లేపల్లి : మాది కొండమల్లేపల్లి మండలంలోని గల కొల్‌ముంతలపహాడ్. నేను 4వ తరగతి వరకు మా ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాను. ఆ తర్వాత మా ఊరి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి వరకు చదివాను. అప్పుడు రోజూ 4 కిలోమీటర్లు స్నేహితులతో కలిసి నడుచుకుంటూ వెళ్లేవాడిని. దేవరకొండలోనే ఇంటర్ చదివాను. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేశాను. బషీర్‌బాగ్‌లోని పీజీ లా కాలేజీ ఎల్ఎల్ఎం చదివాను. నేను పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడే జీవితంలో మంచి స్థాయిలో ఉండాలనే కసితో చదివాను. ఇప్పుడు నేను ఖమ్మం జిల్లా జడ్జిగా పని చేస్తున్నారు. కష్టపడి చదివి జిల్లా జడ్జి స్థాయికి ఎదిగినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది.

ఐదేళ్లు నిండాక బడిలో చేర్పించారు

- బోడ జానయ్య, డీఎస్పీ, వికారాబాద్



అర్వపల్లి: నాకు ఐదేళ్లు నిండాక మా రామచంద్రాపురంలోని ప్రాథమిక పాఠశాలలో నన్ను మా నాన్న చేర్పించారు. అక్కడికి వెళ్లాక మా ఉపాధ్యాయుడు కందుల వెంకట్‌రెడ్డి నన్ను పాఠశాలలో చేర్పించుకున్నారు. తొలిరోజు అ,ఆ లు నేర్పించారు. మొద్దు పలక, బలపంతో బడికి వెళ్లాను. మధ్యాహ్నం ఇంటికి పంపించారు. తొలిరోజు అ, ఆ లు నేర్చుకొని ఇంటికొచ్చాక వాటిని బట్టీ పట్టి చదువుకున్నాను. చిన్ననాటి నుంచి పోలీస్ కావాలని అనుకున్నాను.

ఆ రోజుల్లో పాఠశాలకు పంపడమే గొప్ప

- జోగుల నర్సయ్య, ఇంటలిజెన్స్ డీఎస్పీ, హైదరాబాద్



రామన్నపేట: నేను 1966లో రామన్నపేట మండలం లక్ష్మాపురంలో జన్మించాను. ఆరేళ్ల వయసులో మా నాన్నగారు జోగుల రామలింగయ్య నన్ను స్వయంగా తీసుకెళ్లి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆ రోజుల్లో పాఠశాలకు పంపడమే చాలా గొప్ప విషయం. గ్రామంలో వంద మంది పిల్లలు ఉంటే పది, ఇరవై మందే పాఠశాలల్లో చేరేవారు. పాఠశాలల్లో ఇప్పుడున్న వసతులు అప్పట్లో లేవు. అయినా చదువులు సాఫీగా సాగేవి. ఏడో తరగతి వరకు లక్ష్మాపురం ప్రభుత్వ పాఠశాలలో చదివాను. 8వ తరగతికి హైదరాబాద్‌కు వెళ్లి హాస్టల్ ఉంటూ సుల్తాన్ బజార్ క్లాక్‌టవర్ స్కూల్‌లో చదివా. చదువంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగింది. నేటి సమాజంలో విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదు. చదువుకు పేదరికం ఏ మాత్రం అడ్డంకి కాదు. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయిలో ఉండగలిగా.

గంజాయి మత్తులోనే గొడవలు

- గ్యాంగ్‌వార్‌కు దిగితే ఉపేక్షించేది లేదు
- మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



మాట్లాడుతున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, పక్కన పోలీస్ సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో ఎక్కువగా గంజాయి మత్తులోనే గొడవలు జరుగుతున్నట్లు గుర్తించామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. మంగళవారం ఆయన మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండగా.. మిర్యాలగూడ పట్టణంలో కొంతమంది రౌడీషీటర్ల కనుసన్నల్లో గ్యాంగ్‌వార్‌కు దిగారని అన్నారు. గ్యాంగ్‌వార్‌కు దిగితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటివరకు జరిగిన గ్యాంగ్‌వార్‌కు సంబంధించి మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు అనే విషయాలను గమనించాలని సూచించారు. గంజాయి విక్రయించినా, సేవించినా కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రౌడీషీట్ ఉన్న వారి పది సంవత్సరాల డేటా పరిశీలించి ఎలాంటి కేసులు లేకుంటే వారిపై రౌడీషీట్ తీసివేస్తామని, ఒక్క కేసు నమోదైనా తిరిగి జైలుకు పంపుతామని అన్నారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గుట్కా విక్రయదారులపై, బెల్ట్ షాపుల నిర్వాహకులపై సైతం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌పై ఉన్న హోటళ్లు, దాబాల నిర్వాహకులు రోడ్లపై వాహనాలు ఆపకుండా చూడాలన్నారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మిర్యాలగూడ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు సుధాకర్, నాగార్జున, వీరబాబుతో పాటు ఎస్ఐలు ఉన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలని వినతి

భూదాన్‌పోచంపల్లి: చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పోచంపల్లి చేనేత సహకార సంఘానికి చెందిన నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చేనేత నాయకుడు ఏలే భిక్షపతి మాట్లాడుతూ.. పోచంపల్లి చేనేత సహకార సంఘంలో పేరుకుపోయిన కోటిన్నర విలువైన చేనేత వస్త్రాలను ప్రభుత్వం టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. అదేవిధంగా టెస్కో ద్వారా సంఘానికి రావాల్సిన రూ.20లక్షల బకాయిలు, ప్రభుత్వం నుంచి రూ. 73లక్షల రిబేట్ డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సంఘాలకు పావలా వడ్డీ కింద క్రాష్ క్రెడిట్, వస్త్రాలపై రిబేట్ చెల్లించాలన్నారు. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలని తెలిపారు. నేతన్న బీమాను పకడ్బందీగా అమలు చేయాలని, నూలు సబ్సిడీ నేరుగా చేనేత కార్మికుడి ఖాతాలో జమ చేయాలని కోరారు. బతుకమ్మ చీరలను కేవలం సిరిసిల్ల ప్రాంతానికే పరిమితం చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులను నుంచి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏలే భిక్షపతి, గంజి కృష్ణ, గంజి బస్వలింగం, కూరపాటి వెంకటేశం, తుమ్మ లక్ష్మీనారాయణ, వర్కాల వెంకటేశం, ఆడెపు భాస్కర్, రవీందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గౌరవాన్ని కాపాడుతారని ఆశిస్తున్నా

- నష్టాల్లో ఉన్న డీసీసీబీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చా
- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



గొంగిడి మహేందర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: నల్లగొండ డీసీసీబీలో తనతో పాటు మరో 9మంది డైరెక్టర్లు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని.. వారంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఈ నెల 28న నిర్వహించే అవిశ్వాస సమావేశంలో తన వెంటే ఉండి పార్టీ గౌరవాన్ని కాపాడుతారని ఆశిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. తనపై అవిశ్వాసం పెట్టిన నేపథ్యంలో మంగళవారం ఆయన నల్లగొండ డీసీసీబీలో సాక్షితో మాట్లాడారు. డీసీసీబీలో 19మంది డైరెక్టర్లకు గాను తనతో కలిపి 18 మంది బీఆర్ఎస్‌కు చెందిన వారు, ఒకరు కాంగ్రెస్ డైరెక్టర్ ఉండేవారని.. ఇటీవల ఎనిమిది మంది డైరెక్టర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ.. ఇంకా 10మంది బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని పేర్కొన్నారు. 14 మంది డైరెక్టర్ల సంతకాలతో జిల్లా సహకార అధికారికి తనపై అవిశ్వాసం నోటీసు ఇచ్చినందున.. ఈ నెల 28న నిర్వహించే సమావేశానికి ఆరుగురు డైరెక్టర్లు గైర్హాజరైతే అవిశ్వాసం వీగిపోతుందని అన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టే నాటికి రూ.900కోట్ల టర్నోవర్ ఉన్న డీసీసీబీని ప్రస్తుతం రూ.2400 కోట్ల టర్నోవర్‌కు తీసుకువచ్చామన్నారు. 11 శాతంగా ఉన్న ఎన్‌పీఏను 1.83 శాతానికి తీసుకువచ్చి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపామన్నారు. గత కాంగ్రెస్ పాలకవర్గంలో నష్టాల్లో ఉన్న బ్యాంకును బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, రైతుల సహకారంతో తమ పాలకవర్గం అభివృద్ధి పథంలో నడిపించిందని పేర్కొన్నారు. ఎక్కడా అక్రమాలకు తావివ్వకుండా బదిలీలను నిర్వహించిన ఘనత తమకే దక్కిందన్నారు. ఉత్తమ డీసీసీబీ చైర్మన్‌గా జాతీయస్థాయి అవార్డును తీసుకుని బ్యాంకు పేరు ప్రఖ్యాతలను నిలబెట్టిన సంతృప్తి మిగిలిందన్నారు. ఆయన వెంట డైరెక్టర్లు రంగాచారి, ప్రవీణ్‌రెడ్డి, అప్పిరెడ్డి ఉన్నారు.

మైల సముద్రం చెరువు పరిశీలన

కనగల్ : కనగల్ మండల పరిధిలోని మైల సముద్రం చెరువు, వాగును రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, ఈఈ ఆనందరావు, డీఈ సురేష్ కుమార్, ఏఈ రమాకీర్తి మంగళవారం పరిశీలించారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాలతో మైల సముద్రం చెరువును, వాగును ఏఎమ్మార్పీ నీటితో నింపడానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా అక్కడి కాల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోలి జగాల్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చనగాని యాదగిరి, కష్టయ్య, పెద్దులు, సురిగల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, వైద్యుల తీరుపై కొంతమంది చేసిన ఫిర్యాదులపై మంగళవారం విచారణ చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు నల్లగొండ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాత్యు చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

వేప కషాయాలతో ఉపయోగాలు మెండు

పాడి పంట

నడిగూడెం: వేపలో ఔషధ గుణాలతో పాటు పర్యావరణానికి మేలు చేసే ఎన్నో సుగుణాలున్నాయి. ఇటీవల పంటల్లో రసాయన మందుల స్థానంలో వేప గింజలు, ఆకులతో తయారు చేసిన కషాయాల వినియోగం పెరిగింది. గత రెండేళ్ల వేప కాత సరిగ్గా లేదు. ఈ ఏడాది మాత్రం వేప చెట్లకు విపరీతంగా వేపకాయలు కాశాయి. రైతులు తమ ఇంటి వద్దే తక్కువ ఖర్చుతో వేప గింజలు, ఆకులతో కషాయాలు తయారు చేసుకోవచ్చని కోదాడ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. రాజగోపాలరావు వివరించారు.

వేప గింజల కషాయం..

వేపలో ఉండే అజాడిరెక్టిన్ అనే పదార్థం వివిధ రకాల పురుగుల గుడ్లు, లార్వా, ప్యూపా దశలతో పాటు తల్లి పురుగులపై ప్రభావాన్ని చూపుతుంది. వేప గింజల ద్రావణాన్ని పొగాకు లద్దె పురుగు, శనగపచ్చ పురుగు, నామాల పురుగు, ఆకుముడత పురుగు, రసం పీల్చే పురుగు నివారణలో అన్ని పంటలలో వాడుకోవచ్చు. దీనిని నారుమడులలో కూడా పురుగుల నివారణకు



వేప కాయలు

గాను ఉపయోగించవచ్చు.

- **కావాల్సిన పదార్థాలు:** వేప గింజలు– 5కిలోలు, కుంకుడు కాయలు– 500గ్రాములు, సరుపు పొడి– 100 గ్రాములు
- **తయారు చేయు విధానం:** నీడలో బాగా ఎండిన వేప గింజల పైపొట్టు తీసి మెత్తగా రుబ్బి పిండి చేయాలి. ఈ విధంగా తయారైన వేప గింజల పిండిని ఒక మూటలో కట్టి 10లీటర్ల నీటిలో మూటను 10 నుంచి 12 గంటలు నానబెట్టాలి. తర్వాత నీటిలో మూటను ముంచి పట్టుకొని 15–20 నిమిషాల పాటు ద్రావణాన్ని పిండాలి. మధ్య మధ్యలో మూటను నీటిలో ముంచుతూ ద్రావణాన్ని సేకరించాలి. ఈ ద్రావణాన్ని పలుచని గుడ్డతో వడపోయాలి. వడపోసిన ద్రావణానికి 100గ్రాముల సరుపు పొడిని లేదా అరలీటరు కుంకుడుకాయ రసాన్ని కలపాలి. ఈ వేప గింజల ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో పిచికారీ చేసుకోవాలి.

ఉపయోగాలు..

- వేప గింజలను ప్రస్తుత జూన్ నెలలలో సేకరించుకొని గోనె సంచులలో నిల్వ ఉంచుకోవాలి. ఈ విధంగా సేకరించిన వేప గింజలను సంవత్సరం వరకు నిల్వ ఉంచుకోవచ్చు.
- వేప గింజల ద్రావణాన్ని తయారుచేసిన వెంటనే పంటలపై పిచికారీ చేయాలి. నిల్వ ఉంచవద్దు.
- పంట దశ, పురుగుల ఉధృతిని బట్టి మోతాదు పెంచుకోవాలి.
- వేప ద్రావణాన్ని పండ్ల తోటలలో కూడా పిచికారీ చేసుకొని మంచి ఫలితాలు పొందవచ్చు.
- వేప ద్రావణం చేసిన తర్వాత వచ్చిన పిప్పిని ఇంట్లో ఉన్న పెరటి మొక్కలు, కుండీలలో ఉన్న మొక్కలకు వేసుకోవచ్చు.
- వేప ద్రావణాన్ని అన్ని పంటలలోనూ వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు ఉపయోగించవచ్చు.

ఆహార ధాన్యాల నిల్వలో వేప ఉపయోగం

వేప ఆకుల ముద్ద, ఆవు పేడ కలిపి గోదాములను తొట్టిలను శుభ్రం చేసి పురుగుల నుంచి ఆహార ధాన్యాలను కాపాడుకోవచ్చు. పప్పు ధాన్యాలలో ఎండిన వేపాకుల పొడి, గింజల పొడి లేదా నూనె కలిపి పురుగులు సోకకుండా నాలుగు నెలల పాటు భద్రపరచవచ్చు.

- పంట తొలిదశలో ఆశించే రసం పీల్చు పురుగులు, చిన్న లార్వాల నియంత్రణలో వేప ద్రావణాన్ని ఉపయోగించి మంచి ఫలితాలు సాధించవచ్చు.
- పంట పెరిగే కొద్దీ ద్రావణం మోతాదు పెంచుకొని పిచికారీ చేయాలి.

వేప ఆకుల కషాయం..

కిలో పచ్చి వేప ఆకులను 5లీటర్ల నీటిలో 12 గంటలు నానబెట్టాలి. నానిన ఆకులను నూరి నీటిలో కలిపి వడపోసి రసాన్ని వేరు చేయాలి. ఈ రసానికి సరుపు పొడి కలపాలి. ఎకరం పంటకు 40 కిలోల వేప ఆకు సరిపోతుంది.

పంటలకు ఎరువులుగా..

వేప పచ్చి ఆకు ఎరువుగానే కాక పురుగులు ఆశించకుండా పనిచేస్తుంది. వేప పిండిని ఎరువుగా వాడినప్పుడు అది వేర్ల వద్ద ఉన్న చెద పురుగులను, నులిపురుగుల నుంచి రక్షిస్తుంది. వేప పిండి పొలంలో వేయడంతో పంటలకు మేలు చేసే పురుగుల సంఖ్య పెరుగుతుంది. నేల స్వభావం కూడా అభివృద్ధి చెందుతుంది.